క్లుప్తంగా

సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని జోహరాపురం 19వ వార్డు పరిధిలో ఉన్న బీడీ వర్కర్స్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర కమిటీ నాయకులు ఎస్ ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ పెరిగిపోయిన కంపచెట్లను తొలగించాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కనీస సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్ నయీం, సయ్యద్ అహ్మద్, మహబూబ్‌బాషా, ఎండీ నబీ, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

పెంటావాలెంట్ వ్యాక్సిన్ కొరత లేకుండా చూడండి



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ కొరత లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసులుకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా సోమవారం వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అనేక పీహెచ్‌సీల్లో నాలుగు నెలలుగా పెంటావాలెంట్ వ్యాక్సిన్ల కొరత ఉందన్నారు. బాలల ఉజ్వల భవిష్యత్‌కు కారణమైన వ్యాక్సిన్లను కొరత లేకుండా సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తగినంతమేర వ్యాక్సిన్ అందుబాటులో ఉంచకపోతే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.

ముగిసిన శ్రీదేవి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో మహాగౌరి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీదేవి నవ రాత్రులు సోమవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా మహా గౌరి అమ్మవారి సన్నిధిలో కలశోద్వాసన జరిపి, మేరు శ్రీచక్రానికి షోడశోపచార పూజ, 108 అష్టోత్తర శత కలశాభిషేకం, శ్రీ లలితా సహస్రనామ పారాయణం పూర్వకంగా భక్తులు స్వయంగా అమ్మ వారికి అభిషేకం చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామ కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం పెద్దపాడులో వాగును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు డీఆర్వో చిరంజీవికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని ఒడ్లోని వాగును కొందరు రియల్ ఎస్టేట్ కోసం ఆక్రమించుకోవడంతో సమీపంలో ఉన్న దళితుల ఇళ్లలోకి వర్షపు నీరు వస్తోందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు మధు, గోపీ పాల్గొన్నారు.

హిందూ ధర్మ రక్షణకు కంకణబద్ధులు కావాలి



గోదా గోకులంలో రమణ చరణ తీర్థ స్వామి

కర్నూలు కల్చరల్: తమిళనాడు తిరువణ్ణామలైకి చెందిన శ్రీ రమణ చరణ తీర్థ స్వామి నగర శివారులోని గోదా గోకులాన్ని సందర్శించారు. ఈయన శ్రీశైలంలో శివానంద లహరి ప్రవచనం సప్తాహంలో పాల్గొనేందుకు వెళుతూ మార్గం మధ్యలో గోదా గోకులంకు వచ్చారు. శ్రీ రంగనాథ స్వామి వారికి మంగళ శాసనం చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. హిందూ ధర్మ రక్షణకు అందరూ కంకణబద్ధులు కావాలన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ప్రవచనాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీపై చిత్తశుద్ధి ఏదీ?

- నగర పాలకలో కీలక పోస్టులన్నీ ఖాళీ
- 2,160 మంది వలంటీర్లను రోడ్డున పడేసిన ప్రభుత్వం
- ముఖ్యమైన విభాగాల్లోనూ అదే పరిస్థితి
- అన్ని విభాగాల్లో 507 పోస్టులు ఖాళీ



కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పట్టణ సేవల్లో, మౌలిక సదుపాయాల కల్పనలో కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రజల నుంచి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ నగర అభివృద్ధికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం తదితర వాటికి ప్రాధాన్యత ఇస్తుంది. ఇటువంటి కీలకమైన శాఖలో ఒకటి కాదు.. రెండు కాదు.. అన్ని విభాగాల్లో కలిపి 507 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెయిన్ సెక్షన్ నుంచి టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం, పారిశుద్ధ్య విభాగం, రెవెన్యూ విభాగం ఇలా అన్ని విభాగాల్లోను ఇదే పరిస్థితి. సచివాలయాల్లోను అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల పరిధిలో గత ప్రభుత్వంలో 2,160 మంది వలంటీర్లు పనిచేసేవారు. వేతనం రూ. 5 వేలు అయినా ఒక్కో వలంటీర్ ప్రతి 100 ఇళ్లకు సంబంధించిన అన్ని రకాల సేవలు, ప్రభుత్వ పథకాలు, ప్రజల అవసరాలను మంజూరు చేయడం తదితర వాటిని పక్కాగా చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం ఎన్నికల ముందు వలంటీర్ల సేవలను గుర్తించాం. వారికి రూ.10 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పటికి 4 నెలలు దాటింది. వీరందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడంతో ఈ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎన్నికల వరకు ఒక మాట అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

కీలక పోస్టులు ఖాళీ

నగరపాలక సంస్థలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోవడంతో పాలన పరంగా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏటా రూ.300 కోట్ల బడ్జెట్ కలిగిన ఈ సంస్థలో ప్రభుత్వం పోస్టుల భర్తీ విషయంలో అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. నగర పాలకలో మొత్తం 2,216 మంది ఉద్యోగులు ఉన్నాయి. ఈ పోస్టులన్నింటికీ పాలన పరమైన అనుమతులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,709 మాత్రమే. 507 ఉద్యోగాలు భర్తీ కావాల్సి ఉంది. మరోవైపు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాత్రం మున్సిపాల్టీలలో పోస్టులన్నీ భర్తీ చేస్తాం అంటూ పత్రిక ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో కనిపించడం లేదు. ఇప్పటికీ డిప్యూటీ కమిషనర్ నుంచి అసిస్టెంట్ సిటీ ప్లానర్, సర్వేయర్, హెల్త్ అసిస్టెంట్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, చైన్‌మన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల సిబ్బంది ఇలా.. ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగులు లేక, పర్యవేక్షణ లేక పాలన పట్టు తప్పిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాలనపై తీవ్ర ప్రభావం

ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. టౌన్ ప్లానింగ్‌లో నిర్మాణాల పర్యవేక్షణ, అక్రమ నిర్మాణాల గుర్తింపు, అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టడం సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు తదితర వాటిని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలి. ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిమాలిషన్ స్క్వాడ్ వ్యవస్థ అటకెక్కింది. సర్వేయర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. నగరపాలక పరిధిలో స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి తన భూమికి సంబంధించిన కొలతలు వేయాలని రూ.1500 చలానా కట్టి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. చెత్త సమస్య అలాగే ఉంది. హెల్త్ అసిస్టెంట్ లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య మళ్లీ మొదటికి వచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోను అదే పరిస్థితి. గ్రౌండ్ లెవల్‌లో అభివృద్ధి పనుల తీరును పర్యవేక్షణ చేయాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. అభివృద్ధి పనులన్నీ మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. పరిపాలన పరంగా జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు ఇలా... పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలన పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

నగరపాలక సంస్థలో మంజూరైన పోస్టుల సంఖ్య - 2,216
- ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1.709
- ఖాళీ పోస్టుల సంఖ్య - 507

నగరపాలకలో మెయిన్ సెక్షన్‌లో మంజూరైన పోస్టులు - 141
- ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు -- 98
- ఖాళీగా ఉన్న పోస్టులు - 43

ఇంజినీరింగ్ విభాగంలో మంజూరైన పోస్టులు - 250
- ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు - 123
- ఖాళీగా ఉన్న పోస్టులు - 127

పారిశుద్ధ్య విభాగంలో మంజూరైన పోస్టుల సంఖ్య - 605
- ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య - 335
- ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య - 270

టౌన్ ప్లానింగ్‌లో మంజూరైన ఉద్యోగుల సంఖ్య - 23
- ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు -13
- ఖాళీగా ఉన్న పోస్టులు - 10

వార్డు సచివాలయాల ఉద్యోగులు - 1197
- పనిచేస్తున్న ఉద్యోగులు - 1140
- ఖాళీగా ఉన్న ఉద్యోగుల సంఖ్య- 57

కర్నూలు నగర జనాభా : 6.50 లక్షలు
- నగర విస్తీర్ణం - 117.9 చదరపు కి.మీ
- వార్డులు 52 (కర్నూలు -33, పాణ్యం-16, కోడుమూరు -3)

ఖాళీగా ఉన్న కీలక పోస్టులు (కొన్ని మాత్రమే)

- డిప్యూటీ కమిషనర్
- కార్యదర్శి
- శానిటరీ సూపర్‌వైజర్
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
- అసిస్టెంట్ ఇంజినీర్
- డ్రాఫ్ట్‌మెన్
- నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు
- హెల్త్ అసిస్టెంట్లు
- మలేరియా మజ్దూర్‌లు
- టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్లు
- టౌన్ సర్వేయర్
- టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు
- వార్డు కార్యదర్శులు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం నగరంలోని గణేష్ నగర్, రామచంద్రమిషన్ ఏరియా, రెవెన్యూ కాలనీ, సీ క్యాంపు, శ్రీరామ్ నగర్‌లలో విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో కోతలు...

మండల పరిధిలోని పంచలింగాల 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం పంచలింగాల, గొందిపర్ల, ఈ తాండ్రపాడు, దేవమడ, పంచలింగాల స్కందా కు విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పదో తరగతి ఆపై చదివిన అభ్యర్థులకు ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహా హెచ్‌ఆర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చిత్తూరు శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీ డైకిన్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఇక్కడ ఖాళీలను భర్తీ చేసేందుకు కంపెనీ వారు 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు స్థానిక భాగ్యనగర్‌లోని ఫస్ట్‌స్టెప్ శిక్షణ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు పూర్తి వివరాలను https://bit.ly/simhosri ద్వారా రిజిస్టర్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 26 ఏళ్లలోపు ఉండాలని, ఎంపికై న వారికి రూ.12,500 నుంచి రూ.14వేల వరకు జీతం, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు.

పంట దిగుబడులను తడిసిపోనీయొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు వర్షసూచన ఉన్న నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తులు వర్షాలకు తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దిగుబడులు తడవకుండా తీసుకొస్తేనే గిట్టుబాటు ధరలు లభిస్తాయని సూచించారు. ఇదిలాఉండగా అల్పపీడన ప్రభావం వల్ల జిల్లాలో సోమవారం ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు మాత్రమే కురిశాయి.

అక్రమంగా ఇంక్రిమెంట్లు ఇవ్వడం తగదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లకు అక్రమంగా ఇంక్రిమెంట్లు ఇవ్వడం తగదని ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. వీరి నియామకానికి సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉందని తెలిపారు. వీరు జూలై 18, 2023 నుంచి ఆగస్టు 25, 2023 వరకు విధుల నుంచి తొలగించబడ్డారని మళ్లీ విధుల్లో చేరారని చెప్పారు. విధుల్లో లేని సమయానికి జీతం ఇచ్చేందుకు వర్సిటీ అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇంక్రిమెంట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. దీనిపై విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

17న వాల్మీకి మహర్షి శోభాయాత్ర

కర్నూలు(అర్బన్): వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఈ నెల 17వ తేదీన శోభాయాత్ర ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు కుంపటి కృష్ణయ్య, కట్టెల రామాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జయంతి రోజున సాయంత్రం 5 గంటలకు స్థానిక బళ్లారి చౌరస్తా నుంచి గౌరీగోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వాల్మీకి కుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కమిటీ నేతలు చింతమాను రాజు, రామానాయుడు, అశోక్, ప్రవీణ్, మణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

17 నుంచి దామోదర కార్తీక దీపోత్సవాలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి శ్రీ దామోదర కార్తీక దీపోత్సవాలను భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు వరకు దామోదరునికి అభిషేకం, ప్రత్యేక పూజలు,ప్రవచనాలు ఉంటాయని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): తుపాను, వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి వడబోసి చల్లార్చిన తర్వాతే తాగాలన్నారు. ఇంట్లో అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే తినాలని సూచించారు. వండిన ఆహారంపై శుభ్రమైన మూతలను ఉంచాలన్నారు. ఇంట్లో దోమలు, ఈగలు, ఇతర క్రిమికీటకాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, వంట చేసే ముందు, భోజనం చేయడానికి ముందు, మలవిసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. బయట ప్రదేశంలో వండిన వంటలు, చిరుతిండ్లకు దూరంగా ఉండాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు చల్లటి గాలి, వానలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఎలాంటి చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉంటే ఆ కుంటలను మట్టితో కప్పివేయాలన్నారు. ఎవరికైనా జ్వరం, వాంతులు, విరేచనాలు, ఏ ఇతర ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే స్థానికంగా ఉన్న ఆశా కార్యకర్తకు, ఏఎన్ఎంలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (నంబర్ : 77300 49277) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి అండర్-14, అండర్-17 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 18వ తేదీ వాలీబాల్, ఆర్చరీ, నెట్‌బాల్, మోడ్రన్ పెంటాథ్లాన్, 22వ తేదీన ఖోఖో, సాఫ్ట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, ఉషూ 25వతేదీన హాకీ,క్రికెట్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌కు చార్జ్ మెమో

కర్నూలు (టౌన్): నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట రాముడుకు ఆ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.రాజశేఖర్ సోమవారం సాయంత్రం చార్జ్ మెమో జారీ చేశారు. తాగునీటి సరఫరాలో విష్ణు టౌన్‌షిప్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇటు వంటి సంఘటనలు ఉన్నాయి. ఎన్నిసార్లు చెప్పినా ఇన్‌చార్జ్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ తన పద్ధతి మార్చుకోలేదు. తాగునీటి ఇబ్బందులు ఉన్నా నీటి సరఫరాలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న కారణంతో ఎస్ఈ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- ఇబ్బందులుంటే 74229 92299 ఫోన్ నంబర్‌కు సమాచారమివ్వండి

కర్నూలు (టౌన్): ఈనెల 17వ తేదీ వరకు వాతవరణంలో మార్పులు, భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక కమిషనర్ సోంగా రవీంద్రబాబు సోమవారం నగరపాలకలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నగర ప్రజలు 74229 92299 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో టీ.స్టెఫెన్, జి.సుధీర్, సుహేయిల్ జాకీర్ ఖాన్ అనే ముగ్గురు సచివాలయాల ఉద్యోగులు మూడు షిఫ్టల ప్రకారం 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, తగు ప్రత్యమ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



వాల్మీకి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించిన బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వాల్మీకి మహర్షి జయంతిని ఈనెల 17న ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ అన్నారు. వాల్మీకి జయంతిని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో వాల్మీకి నేతలతో ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు మీరు అందించే సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. 17వ తేదీన ఉదయం మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జయంతి కార్యక్రమాలను కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వాల్మీకి సంఘాలకు చెందిన నాయకులతో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులందరినీ ఆహ్వానించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘాల నాయకులు కుబేరస్వామి, బేతం కృష్ణుడు, శ్రీనివాసులు నాయుడు, బాల సంజన్న, తలారి కృష్ణమనాయుడు, రమణ, రామాంజనేయులు, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ కీర్తి ప్రతిష్టలు కొనసాగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ కీర్తి ప్రతిష్టలు కొనసాగేలా వైద్య విద్యార్థులు చదువుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు సోమవారం కళాశాలలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో రెండు వారాల ఫౌండేషన్ కోర్సు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో మెలగాలని, హాజరు శాతం 75 శాతానికి తగ్గకుండా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల గురించి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, సీనియర్ ప్రొఫెసర్ల బృందం వాటిని పరిష్కరిస్తుందన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయానందబాబు, హాస్టల్ ఇన్‌చార్జ్‌లు ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ సోమశేఖర్,ఈయూ కో-ఆర్డినేటర్ డాక్టర్ సింధియా శుభప్రద, ఆయా విభాగాల అధిపతులు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

కర్నూలు(సెంట్రల్): గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే హెల్త్ సెక్రటరీలను వైద్య, ఆరోగ్య శాఖకు బదలాయించాలని యునైటెడ్ విలేజ్, వార్డ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెల్త్ సెక్రటరీల సీనియారిటీ జాబితాను తయారు చేసి ఎంపీహెచ్ఏలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపులు ఇవ్వాలని కోరారు. జీఓ నంబర్ 152 ప్రకారం మెటర్నిటీ లీవ్‌లను డెలివరీ తేదీ నుంచి గాకుండా వారు అప్లయ్ చేసిన తేదీ నుంచి మంజూరు చేయాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ట్రెజరీ వారి అభ్యంతరాలతో సరెండర్ లీవ్‌లు పొందలేకపోయారని, వారికి తిరిగి సెలవులను మంజూరు చేయాలన్నారు. అనంతరం డీఆర్వో చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, వరలక్ష్మీ, దేవి, మాన్విత, శంషాద్, సరోజమ్మ, మేరీ, హేమావతి, పద్మ పాల్గొన్నారు.

కలుషిత నీటితో అనారోగ్యం

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుత సీజన్‌లో నీరు కలుషితమై ప్రజలు వాంతులు, విరేచనాలు తదితర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని డెమో శ్రీనివాసులు చెప్పారు. సోమవారం కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్ పరిధిలో చౌడేశ్వరి వీధిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ప్రతిఒక్కరూ నీటిని కాచి చల్లార్చి, వడబోసి తాగాలని సూచించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ, బోధకాలు, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, కావున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్య లక్షణాలు ఉంటే ఆశా కార్యకర్త, ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి తగు చికిత్సలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు జయలక్ష్మి, సువర్ణమ్మ పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న డెమో శ్రీనివాసులు

గురువు కుటుంబానికి అండగా శిష్యులు

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామంలో టీచర్ బడేసాహెబ్ కుటుంబానికి ఆయన శిష్యులు సోమవారం ఆర్థికసాయం అందజేసి గురుభక్తిని చాటుకున్నారు. అలువాల గ్రామానికి చెందిన బడేసాహెబ్ గ్రామంలో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బడేసాహెబ్ దగ్గర చదువుకున్న విద్యార్థులందరూ కలిసి నగదు సేకరించి ఆయన స్వగృహంలో రూ.లక్ష నగదును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. పాఠాలు నేర్పిన గురువు మరణం జీర్ణించుకోలేనిదని, గురువు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని విద్యార్థులు తెలిపారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం



గొందిపర్లలో భూమిపూజలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

కర్నూలు (రూరల్): మండల పరిధిలో గొందిపర్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో రూ.14 లక్షలతో 8 ఫారం పాండ్స్, రూ.6.15 లక్షలతో ఫీల్డ్ చానల్స్, రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, రూ.4.6 లక్షలతో గోకులాలు, రూ.4 లక్షలతో చేపట్టనున్న ఇతర పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె పండుగ ద్వారా జిల్లాలో రూ.82 కోట్లతో 1562 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కోడుమూరు నియోజకవర్గంలో రూ.12.65 కోట్లతో, కర్నూలు మండలంలో రూ.4.28 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామసభలు నిర్వహించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ పల్లెలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని పేర్కొనారు. జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డ్వామా పీడీ మాధవీలత, డీపీఓ భాస్కర్, సర్పంచ్ శ్రీనువాసులు, ఎంపీటీసీ కృష్ణవేణి, ఎంపీడీఓ రఘునాథ్, ఈఓఆర్డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపొందించండి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్

కర్నూలు (సెంట్రల్): స్వర్ణాంధ్ర విజన్-2047కి సంబంధించిన జిల్లా యాక్షన్ డాక్యుమెంట్ ప్లాన్‌ను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆయన సోమవారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి 'గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ) సెన్సిటైజేషన్', 'స్వర్ణాంధ్ర విజన్ 2047' అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 శాతం గ్రోత్ యాన్యువల్‌గా రావాలంటే ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి, ముఖ్యంగా ఎకానమీలో 3 రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్)కి సంబంధించిన వాటిలో ఏ విధంగా ఇంప్రూవ్ చేయవచ్చు అనే దానిపై స్వర్ణాంధ్ర విజన్-2047కి సంబంధించిన జిల్లా యాక్షన్ డాక్యుమెంట్ ప్లాన్‌ను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, సీపీఓ హిమ ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.